అంబేద్కర్ అభయహస్తం ఏదీ?

నారాయణఖేడ్, మార్చి 5: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దళితులకు అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద ఇవ్వాల్సిన రూ.12లక్షలు ఏవని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం దళితులను మభ్యపెట్టేందుకు అనేక హామీలిచ్చి అధికారం చేపట్టిన తర్వాత అమలు చేయకపోవడం కాంగ్రెస్ దగాకోరు రాజకీయానికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీలకు 18శాతం, ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీలు ఆయా వర్గాల ప్రజలు మరిచిపోలేదన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కనీస వేతనాలు అమలుచేయాలి

అందోల్, మార్చి 5: రోజంతా కష్టపడి పని చేసిన కార్మికులకు కనీసం వేతనం అమలు కావడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. బుధవారం జోగిపేటలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి 20లక్షల మంది కార్మికులను నేటికీ కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. 7వ తేదీన అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నా చేస్తామని కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు రాములు, ప్రభాకర్, శేకమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తులపై కేసు నమోదు

జిన్నారం, మార్చి 5: పంచాయతీరాజ్ రోడ్డును ఆక్రమిస్తున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం జిన్నారం మండలంలోని ఖాజిపల్లి నుంచి మంత్రికుంటకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డును ఖాజిపల్లికి చెందిన ఎస్‌కే.ఉస్మాన్, ఎస్‌కే.సలీం, ఎస్‌కే.జహీర్ కొంత మంది కలిసి జేసీబీ సహాయంతో రోడ్డును తవ్వి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఖాజిపల్లి గ్రామస్తులు గడ్డపోతారం మున్సిపాలిటీ కమిషనర్ జైత్రంకు ఫిర్యాదు చేశారు. ఆయన పోలీసులకు తెలియజేయడంతో బొల్లారం సీఐ రవీందర్‌రెడ్డి ఆ వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ సదస్సుకు కృష్ణమూర్తి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 5: అంతర్జాతీయ న్యూరో సదస్సులో సంగారెడ్డి హోప్ దవాఖాన న్యూరో సర్జన్ డాక్టర్ కృష్ణమూర్తి పాల్గొననున్నారు. ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు గోవాలో జరిగే సదస్సులో ఆయన ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు ఆయనను అభినందించారు.

పంటల పరిశీలన

పుల్కల్, మార్చి 5: నమస్తే తెలంగాణ దినపత్రికలో బుధవారం లోవోల్టేజీతో ఎండుతున్న పంటలు అనే కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని ఇసోజిపేట-కోడూర్ గ్రామాల సమీపంలో కరెంట్ సమస్య ఏదైనా ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్ రైతులకు సూచించారు. ఎండిన పంటలను పరిశీలించారు. విద్యుత్ వల్ల ఏ ఇబ్బందులు ఉన్నా ఫోన్‌లో సమాచారం అందించాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా రైతులు పంటలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు పొలాల్లో నీరు ఉండేలా చూసుకోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నారాయణఖేడ్, మార్చి 5: నారాయణఖేడ్ మండలం సంజీవ్‌రావుపేట్‌కు చెందిన సత్యం కుమారుడు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పడంతో పాటు ఎటువంటి సమస్య వచ్చినా అండగా ఉంటానని వారికి భరసానిచ్చారు. ఆయన వెంట సాయిరెడ్డి, భూపాల్, భూపాల్‌రెడ్డి, శ్రీను, భూమయ్య, సురేశ్, విఠల్ తదితరులు ఉన్నారు.

చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్

జహీరాబాద్, మార్చి 5: జహీరాబాద్‌లోని సాయినగర్ కాలనీలో చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. కాలనీవాసుల కథనం ప్రకారం..సోమవారం అర్ధరాత్రి చెడ్డీ గ్యాంగ్ కత్తులు, కటార్లతో తిరుగుతూ ఓ ఇంటి తాళాన్ని పగులగొట్టేందుకు ప్రయత్నించిది. అదే సమయంలో పక్కింటి యజమాని ఎవడ్రా అంటూ అరవడంతో చెడ్డీ గ్యాంగ్ అక్కడి నుంచి పారిపోయింది. కాలనీలోని ఓ ఇంటి ఆవరణలో అమర్చిన సీసీ కెమెరాలో చెడ్డీ గ్యాంగ్ దృశ్యాలు నమోదయ్యాయి. విషయం తెలుసుకున్న కాలనీవాసులు భయందోళలకు గురవుతున్నారు. పట్టణంలో చోరీలు జరగకుండా ముందుజాగ్రత్తగా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలి

- నల్లవల్లి, కొత్తపల్లి రిలే నిరాహారదీక్షలకు సంఘీభావం పలికిన సీపీఎం నాయకులు
- గుమ్మడిదలలో రిలే నిరాహారదీక్షలో సీజీఆర్ ట్రస్ట్ సభ్యులు

గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్షలో సీజీఆర్ ట్రస్ట్ సభ్యులతో జేఏసీ నాయకులు, నల్లవల్లిలో డంపింగ్ యార్డును రద్దు చేయాలంటూ రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రాజయ్య

గుమ్మడిదల, మార్చి 5: ప్యారానగర్ డంపింగ్ యార్డు అనుమతులు రద్దు చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని సీపీఎం నియోజకవర్గ నాయకుడు, ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ రాజయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ప్రజాసంఘాలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు బుధ వారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. నల్లవల్లిలో 29వ రోజు రిలే నిరాహార దీక్షలో మాల మహానాడు సంఘం సభ్యులు, ఆ గ్రామానికి చెందిన 70 కుటుంబాల సభ్యులు దీక్ష చేపట్టారు. కొత్తపల్లిలో గ్రామస్తులు రిలే దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు సీపీఎం నాయకులు రాజయ్య, నాగేశ్వర్ రావు, నర్సిం హులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డును రద్దు చేయాలంటూ రెండు గ్రామాల ప్రజలతో సం తకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రాజయ్య మాట్లాడుతూ డంపింగ్ యార్డు వల్ల నష్టం లేకుంటే ప్రజలను ఒప్పించి మెప్పించే ప్రయత్నం ఎందుకు చేస్తలేరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాంకీ సంస్థ చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలన్నారు. గతంలో జవహర్ నగర్‌లో కూడా ఇలాంటి ఎన్నో అబద్ధాలు చెప్పి అక్కడి ప్రజలకు తీవ్ర నష్టం చేశారని మండిపడ్డారు. ఇటీవల సీపీఎం నాయకులు జవహర్‌నగర్ డంపింగ్ యార్డును క్షేత్రస్థాయిలో పరిశీలించారన్నారు. అక్కడి ప్రజలు నిత్యం పడరానిపాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి ఇబ్బందులు గుమ్మడిదల ప్రజలు పడొద్దని పోరాటం చేస్తున్నామన్నారు. మండల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరనున్నామన్నారు. దీనికి నిరాకరిస్తే అసెంబ్లీ ముట్టడి ఉంటుందని హెచ్చరించారు. గుమ్మడిదలలో సీజీఆర్ ట్రస్ట్ సభ్యులు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డితో పాటు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని పల్లెలో కారుచిచ్చులా డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజలకు అన్యాయం చేయరాదని సూచించారు. కార్యక్రమం లో రైతు జాతీయ నాయకుడు మంద బలరాంరెడ్డి, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, నాయకులు పుట్ట నర్సింగ్‌రావు, మంద భాస్కర్‌రెడ్డి, ఆకుల సత్యనారాయణ, సదానంద రెడ్డి, కాలకంటీ రవీందర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, ఆంజనేయులు, సూర్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నాగేందర్ గౌడ్, కావలి శంకర్‌యాదవ్, వాసుదేవారెడ్డి, చంద్రారెడ్డి, రౌతునరేశ్, నర్సింహులు, మహిపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, మల్లేశ్ గౌడ్, రామకృష్ణ, మధు, శివరాములు, రాజుగౌడ్, కొరివి సురేశ్, యాదగిరి పాల్గొన్నారు.

రైతులకు రుణాలిచ్చి ఆదుకోవాలి

సంగారెడ్డి, మార్చి 5: అన్నదాతలకు బ్యాంకులు రుణాలిచ్చి ఆదుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. బుధవారం పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో బ్యాంకు, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రమేశ్ మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రుణాలు మంజూరయ్యేలా అధికారులు చూడాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల న్యాయ సేవాసంస్థల చైర్‌పర్సన్లు (న్యాయమూర్తులకు)రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంపిన ఉత్తర్వుల ప్రకారం సదస్సు ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించామన్నారు. పంటరుణాలకు అదనంగా మొదటి ప్రాధాన్యతలో దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయాలని, అప్పు అవసరమున్న రైతులందరూ బ్యాంకుల్లో దరఖాస్తు చేసుకోచ్చని సూచించారు. రుణాలు మంజూరు చేయకపోతే

బ్యాంకర్లు, వ్యవసాయ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేశ్

అందుకు కారణాలను రాతపూర్వకంగా రైతుకు తెలపాలని స్పష్టం చేశారు. ప్రైవేటు అప్పుల బాధతో ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి తెలిపారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ గోపాల్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, రైతు నాయకులు పాకాల శ్రీహరిరావు, తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేందర్‌రెడ్డి, మంజీరా రైతు సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజు, రైతులు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

సంగారెడ్డి, మార్చి 5: అభం శుభం తెలియని చిన్నారులపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని బాలసదనం, శిశుగృహ, సఖీ-భరోసా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పిల్లల అవసరాలను తీర్చడంతోపాటు చట్టాలపై అవగాహ న కల్పించాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులకు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ నేర్పించాలన్నారు. వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలందరూ చదువుపై దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నా రు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాల్లో సహాయం అవసరమైతే న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని న్యాయమూర్తి సూచించారు.

తొలిరోజు సజావుగా సాగిన ఇంటర్ పరీక్షలు

- 97.05శాతం విద్యార్థులు హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 5: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమమయ్యాయి. బుధవారం తొలి రోజు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషలకు సంబంధించిన పరీక్షలు జరిగాయి. 97.05 హాజరు శాతం నమోదైంది. జిల్లాలో ఏర్పాటు చేసిన 54 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 18,852 మంది విద్యార్థులకు 18,296 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 556 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ కేటగిరీకి సంబంధించి మొత్తం 17,907 మంది విద్యార్థులకు 17,415 మంది హాజరయ్యారు. 492 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ కేటగిరీలో 945 మందికి 881 మంది హాజరయ్యారు. 64 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా

సంగారెడ్డిలోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

సంగారెడ్డి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదు. కలెక్టర్ వల్లూరు క్రాంతి సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ ఉన్నారు. రెండు డీఐఈవో బృందాలు, నాలుగు డీఈసీ, నాలుగు హెచ్‌ఈసీ బృందాలతోపాటు 12 ఫ్లయింగ్, 8 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఆయా పరీక్షా కేంద్రాలను సందర్శించాయి. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

హత్నూరలో....

హత్నూర, మార్చి 5: హత్నూరలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు సజావుగా జరిగాయి. హత్నూర అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో 135మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఒక విద్యార్థి గైర్హాజరుకాగా, 134మంది పరీక్ష రాశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ 233 మంది విద్యార్థులకు, 9 మంది గైర్హాజరు కాగా, 224 మంది పరీక్ష రాశారు. ఒకేషనల్ 313మంది విద్యార్థులకు, 23మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 290మంది పరీక్ష రాసినట్లు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు మధుసూదన్, అశోక్ తెలిపారు.

నారాయణఖేడ్‌లో....

నారాయణఖేడ్, మార్చి 5: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కాగా, నారాయణఖేడ్ పట్టణంలో ఐదు పరీక్షా కేంద్రాలు, కంగ్టి, మనూరు, కల్హేర్‌లలో ఒక్కో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలో మొత్తం 3,350 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆర్డీవో అశోక చక్రవర్తి తెలిపారు.

జిన్నారంలో...

జిన్నారం, మార్చి 5: ఇంటర్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంమయ్యాయి. బుధవారం జిన్నారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటలకు ప్రారంభం కావడంతో సమయానికి ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు హాజరయ్యారు. మొదటి సంవత్సరంలో 202 మంది విద్యార్థులు ఉండగా, 189 మంది విద్యార్థులు హాజరయ్యారు. 13 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ప్రిన్సిపాల్ కృష్ణ తెలిపారు. పరీక్ష కేంద్రంలో స్క్వార్డ్‌గా లక్ష్మణ్ వ్యవహరించారు.

అమీన్‌పూర్‌లో...

అమీన్‌పూర్ మార్చి 5: అమీన్‌పూర్ పరిధిలో ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటిరోజు సజావుగా కొనసాగాయి. కృష్ణవేణి కళాశాలలో 309 మంది విద్యార్థులకు 307 విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎంపీసీఆర్ పాఠశాల కేంద్రంలో 487 మందికి 483 మంది విద్యార్థులు పరీక్షలను హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు.

నానో ఎరువులతో అధిక దిగుబడులు

సంగారెడ్డి, మార్చి 5: ఇఫ్కో తయారు చేసే నానో ఎరువులపై రైతులు అవగాహన పెంచుకుని పంటలకు వాడితే అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ సూచించారు. బుధవారం పట్టణంలోని పెప్సికో పరిశ్రమ సమీపంలో పార్వతి బ్యాంకెట్ హాల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఇఫ్కో డ్రోన్ సర్వీసులు వినియోగించుకుని పంటలకు మందుల పిచికారీ చేసుకోవాలన్నారు. నానో ఎరువులు వాడకాన్ని అన్నదాతలు మొదలు పెట్టి భవిష్యత్తులో అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఇఫ్కో డీలర్లు రైతులను ప్రోత్సహించి ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలని సూచించారు. సదస్సులో ఇఫ్కో మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్, సీనియర్ ప్రొఫెసర్ సయ్యద్ హుస్సేన్, సీనియర్ సైంటిస్ట్ గిరిజావేణి, మార్క్‌ఫెడ్ డీఎం శ్రీదేవి, ఇఫ్కో జిల్లా మేనేజర్ చంద్ర న్న, డీసీఎంఎస్ వీరేందర్, వంశీ, డీసీఎంఎస్, పీఏసీఎస్ సీఈవోలు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

జహీరాబాద్, మార్చి 5: న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్ చెరువులో స్నానానికి వెళ్లి మృతి చెందిన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ తెలిపారు. మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతానికి చెందిన ఫైసల్ (18) కుటుంబ సభ్యులతో కలిసి గంగ్వార్ సమీపంలోని ముల్తానీ బాబా దర్గా ఉత్సవాలకు హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం చెరువులో స్నానానికెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు.ఫైజల్‌ను రక్షించేందుకు వెళ్లి మృతి చెందిన సంజయ్‌కాంబ్లే శవాన్ని మంగళవారం రాత్రి చెరువులోని నుంచి బయటకు తీయగా, ఫైజల్ మృతదేహం కోసం గాలించినా లభించలేదు. బుధవారం ఈత గాళ్లతో గాలించడంతో శవం లభించింది. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో ఘనంగా సైన్స్ డే

చౌటకూర్, మార్చి 5: మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సైన్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ మానవ పురోగమనానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. చక్రం సృష్టించడం మొదలుకొని బాహ్య అంతరిక్ష అన్వేషణ వరకు, వ్యాక్సిన్ల అభివృద్ధి నుంచి కృత్రిమ మేధస్సు వరకు సైన్స్ ప్రపంచాన్ని విస్తృతంగా ప్రభావితం చేస్తుందన్నారు. సీఆర్సీ చైర్మన్, హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సర్ సీవీ రామన్ ఎఫెక్ట్(పదార్థం ద్వారా పోటాన్ల తాత్కాలిక విక్షేపణం) ఆవిష్కరణకు గుర్తుగా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కలిగించి, కొత్త ప్రయోగాలకు ప్రేరణ కల్పించడం, వైజ్ఞానిక విజయమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాఘవేందర్‌రావు, వివిధ విభాగాధిపతులు ప్రొఫెసర్లు రజనీశ్, జోషిశ్రీపాద్, బేబిశాలిని, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహ

పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన సృజన, మనోహర్

పెయింటింగ్‌లో ఓడీఎఫ్ విద్యార్థుల ప్రతిభ

కంది, మార్చి 5: జాతీయ భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో కంది మండలం ఓడీఎఫ్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభను చాటారు. వీరికి మంగళవారం రవీంద్రభారతి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జాతీయ భద్రతా మండలి, రాష్ట్ర కార్మిక మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా భద్రత, ఆరోగ్యం, పర్యావరణం అంశాలపై పాఠశాల విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ఓడీఎఫ్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన సృజన (9వ తరగతి), మనోహర్ (8వ తరగతి) ప్రథమ, తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు జయంతివాణి విద్యార్థులను అభినందించారు. ఈ పోటీల్లో ఓడీఎఫ్ పాఠశాల నుంచే 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, విజయభాస్కర్, రవీందర్, కనకదుర్గ, చవాన్ సుభాన్‌సింగ్, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జహీరాబాద్, మార్చి 5:సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హద్నూర్ ఎస్ఐ చల్ల రాజశేఖర్ సూచించారు. బుధవారం న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోయాయని, ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. బ్యాంకు అధికారులుగా మాట్లాడే వారిని, రుణాలు ఇస్తామని చెప్పేవారిని నమ్మొద్దన్నారు. రోడ్లపై వెళ్లేటప్పుడు ప్రతి వాహనదారుడు కచ్చితంగా నియమా లు పాటించాలని, వాటిని సంబంధించిన పత్రాలు విధిగా కలిగి ఉండాలన్నారు. మైన ర్లు వాహనాలు నడిపితే చట్టారీత్యా చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. బాల్య వివాహాలు, ఆడపిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. గుర్తుతెలియని వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అమృత్, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హద్నూర్ ఎస్ఐ రాజశేఖర్

శివంపేట బీరు పరిశ్రమ ప్రధాన ద్వారం ఎదుట కరపత్రాలతో కార్మికులు

కార్మికుల సంక్షేమం ప్రభుత్వాలకు పట్టదా ?

చౌటకూర్, మార్చి 5: కార్మికుల సంక్షేమం ప్రభుత్వాలకు పట్టదా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలంటూ ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మండలంలోని శివంపేట చార్మినార్ బీరు పరిశ్రమ ఎదుట బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు లక్షల మంది కార్మికులు కష్టపడి పని చేస్తున్నా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. కష్టపడి సంపాదన సృష్టిస్తున్న కార్మికవర్గం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించడం లేదన్నారు. కార్మికులు అంటే అంతా చిన్నచూపా అని ప్రశ్నించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాగారెడ్డి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం పాటుపాడుతామంటూ గొప్పలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేతులెత్తేసిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించాయని దుయ్యబట్టారు. ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ పరిష్కరించిన పాపనపోలేదని ఎద్దేవా చేశారు. అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 7వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట తల పెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని బాగారెడ్డి కోరారు. కార్యక్రమంలో సీఐటీ మయూ నాయకులు ప్రసన్నరావు, దేవరాజ్, విఠల్, లక్ష్మణ్, కోడూరి సురేశ్, రమేశ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాలి

అందోల్: మోటర్ షోరూంను సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అందోల్, మార్చి 5: అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలో వ్యాపారాలు నిర్వహించే వ్యాపారులు వెంటనే లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాలని, ఇప్పటికీ లైసెన్స్‌లు తీసుకోని వారు వెంటనే లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు సూచించారు. బుధవారం మున్సిపల్ పరిధిలో మున్సిపల్ టాస్క్‌ఫోర్ టీం తనిఖీలు నిర్వహించి పలు దుకాణాలకు నోటీసులు ఇవ్వడంతోపాటు వరుణ